

పీజీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల్లో పీజీ చదువుతున్న విద్యార్థుల నాలుగో సెమిస్టర్ ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్టు డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 468 మంది విద్యార్థులు హాజరుకాగా, 426 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో ఫలితాల వివరాలను అందుబాటులో ఉంచామన్నారు. ఫలితాలపై ఏమైనా సందేహాలుంటే 15 రోజుల్లో పునఃమూల్యాంకనానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

అంబరం.. సిరి సంబరం

- వైభవంగా పెద్దమ్మవారు, నూకాలమ్మ ఉత్సవాలు
- భక్తజన సంద్రమైన పాత శ్రీకాకుళం



శ్రీకాకుళంలో పెద్దమ్మవారు, నూకాలమ్మ సిరిమానోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పాత శ్రీకాకుళం భక్తజన సంద్రమైంది. పదేళ్ల తర్వాత నిర్వహించిన గ్రామ దేవతలు పెద్దమ్మవారు, నూకాలమ్మ సిరిమానోత్సవాల సంబరాలు అంబరాన్ని తాకాయి. ఓవైపు ఘటాలతో ఊరేగింపు, మరోవైపు కోలాటం, తప్పెటగుళ్లు, పులివేషాలు, బిందెల డ్యాన్స్ ప్రదర్శనలతో పండుగ ఉత్సాహంగా సాగింది. వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా.. భక్తులు పెద్ద ఎత్తున సిరిమాను సంబరంలో పాల్గొన్నారు. 6లో


శ్రీకాకుళంలో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

సిక్కోలులో భారీ వర్షం

- మురుగునీటితో పొంగిపొర్లుతున్న కాలువలు
- జలమయమైన ఆర్టీసీ కాంప్లెక్స్

అరసవల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో కాలువలు పొంగి.. రహదారిపై మురుగునీరు ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. జిల్లాపరిషత్ కార్యాలయం, పాతబస్టాండు, చిన్నబరాటం రోడ్డు తదితర ప్రాంతాల్లో మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్ పూర్తిగా జలమయమైపోయింది. విశాఖ నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద నీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ సిబ్బంది కూడా నీటిలోనే తమ విధులను నిర్వర్తించారు.


శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిలిచిన వర్షపు నీరు

చెరువులు కాదు.. మైదానాలే!


- అరకొర సాకర్యాలతో క్రీడాకారుల ఇక్కట్లు
- రాత్రుల్లో మందుబాబుల విన్యాసాలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో క్రీడాకారులు అరకొర సౌకర్యాలతో సతమతమవుతున్నారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో కనీస వసతులు కరువవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఆడుకునేందుకు (మిగతా 7వ పేజీలో..)



ఇంకెన్నాళ్లీ చావులు?

- ఉద్దానంలో పెరుగుతున్న కిడ్నీ వ్యాధి బాధితులు
- చాపకింద నీరులా ప్రబలుతున్న మహమ్మారి
- ఇటీవల మూడురోజుల వ్యవధిలో దంపతుల మృతి
- వరుస మరణాలతో ప్రజల్లో భయాందోళన
- గ్రామాల్లో కనిపించని వైద్యశిబిరాలు


ఉద్దానం ప్రాంతం





వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి గ్రామానికి చెందిన **లండ కర్రెమ్మ(60), అప్పన్న(65)** భార్యాభర్తలిద్దరూ ఇటీవల మూడు రోజుల వ్యవధిలోనే కిడ్నీవ్యాధితో మృతి చెందారు. ఈ దంపతులిద్దరూ కొన్నాళ్లుగా కిడ్నీవ్యాధితో బాధపడుతున్నారు. కర్రెమ్మ గత నెల 31న కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతిచెందారు. భార్య మృతి చెందిందన్న దిగులుతో కిడ్నీవ్యాధితో బాధ పడుతున్న అప్పన్న కూడా మంచానపడ్డాడు. భార్య చనిపోయిన మూడోరోజు.. (ఈ నెల 2న) అప్పన్న కూడా కన్నుమూశాడు. దంపతులిద్దరూ కిడ్నీవ్యాధితో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగి పోయారు. కిడ్నీ మహమ్మారి ఇంకా ఎంతమంది ప్రాణాలు బలిగొంటుందోనని భయాందోళన చెందుతున్నారు.

వజ్రపుకొత్తూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రాంత ప్రజలను కిడ్నీ సమస్య వేధిస్తోంది. పాతికేళ్లుగా ఈ ప్రాంతంలో కిడ్నీవ్యాధితో వందల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. వేలసంఖ్యలో వ్యాధి గ్రస్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తూనే ఉన్నారు. ప్రభుత్వం కిడ్నీ బాధితులకు డయాలసిస్ సేవలు, ఉచిత మందులు అందజేస్తోంది. కానీ, కిడ్నీ వ్యాధి వ్యాప్తికి కారణాలు మాత్రం బయటపడడం లేదు. ఇటీవల వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లిలో మూడురోజుల వ్యవధిలో భార్యాభర్తలిద్దరూ కిడ్నీవ్యాధితో మృతి చెందడంతో ఈ ప్రాంత వాసుల్లో ఆందోళన పెరిగింది. చాపకింద నీరులా కిడ్నీవ్యాధి ప్రబలుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వజ్రపుకొత్తూరు, కవిటి, కంచిలి, మెళియాపుట్టి తదితర మండలాల్లో కిడ్నీవ్యాధి ప్రబలి మరణాలు సంభవిస్తున్నా.. గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించడం లేదని ఆరోపిస్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలం పరిధిలో నాలుగు పీహెచ్‌సీలు ఉన్నాయి. కానీ, కిడ్నీవ్యాధి నివారణకు సంబంధించి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని పీహెచ్‌సీల్లో రెండోపూట వైద్యులు కూడా ఉండడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రతీరోజు ఒక గ్రామంలో స్థానిక ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల సహ కారంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి.. కిడ్నీ వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఈ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వాహన సదుపాయాలు ఏవీ?

డయాలసిస్ బాధితులకు ప్రభుత్వం ప్రతీ నెలా రూ.10వేలు చొప్పున పింఛన్ అందజేస్తోంది. కానీ, ఆస్పత్రులకు వెళ్లేందుకు వాహన సదుపాయం మాత్రం కల్పించకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో డయాలసిస్ బాధితులకు 108 అంబులెన్స్‌లో ఇంటి నుంచి ఆస్పత్రికి తీసుకెళ్లి.. తిరిగి తెచ్చేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వాహన సదుపాయాన్ని తీసేశారు. దీంతో డయాలసిస్‌కు వెళ్లేందుకు రూ.6వేలు వరకు ఖర్చవుతోందని బాధితులు వాపోతున్నారు. ఆటోల్లో రాకపోకలు సాగించేందుకు (మిగతా 6వ పేజీలో..)

బంగారం కోసం.. చంపేశారా? 8లో

- పెద్దహరిశ్చంద్రపురంలో వృద్ధురాలి హత్య
- మెడలో పుస్తెలతాడు దోపిడీ
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన క్లూస్‌టీమ్

మిన్నంటిన నిరసనలు 7లో

- రాజధాని మహిళలను కించపరచడంపై ఆందోళనలు
- జిల్లావ్యాప్తంగా రోడ్డెక్కిన మహిళలు

ఏడీఏలకు స్థానచలనం 6లో

ఆదిత్యాలయ ఈవోగా కేఎన్‌వీడీ ప్రసాద్



అరసవల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అరసవల్లి ఆదిత్యాలయం ఈవోగా కేఎన్‌వీడీ ప్రసాద్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన విజయనగరంలోని మాన్సాస్ ట్రస్టు ఈవోగా పనిచేశారు. ప్రస్తుత ఆదిత్యాలయ ఈవో వై.భద్రాజీ.. ఏలూరు జిల్లాలోని ద్వారకా తిరుమల దేవస్థానం ఈవోగా బదిలీ అయ్యారు. అలాగే సింహాచలంలోని వరహాలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం నుంచి సూపరింటెండెంట్ పి.సునీల్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ డి.వెంకటరమణ, జూనియర్ అసిస్టెంట్ బాల భాస్కరసాయితోపాటు విజయనగరం మాన్సాస్ ట్రస్టు నుంచి బీఎస్.చక్రవర్తి అరసవల్లి దేవస్థానానికి అదే హోదాల్లో బదిలీపై రానున్నారు. అరసవల్లిలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ ఎం.కావ్య.. విజయనగరంలో మాన్సాస్ ట్రస్టుకు బదిలీ అయ్యారు.

దైవ దర్శనానికి వెళ్తూ...

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ఒడిశా వాసుల దుర్మరణం
- ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొన్న లగేజీ వ్యాన్
- మృతుల్లో తండ్రి, కుమార్తె..





గోకుల్‌పండా. సుశాంత్‌కుమార్ సాబతో, సంతోషి సాబతో మృతదేహాలు



టెక్కలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వారంతా దైవదర్శనానికి ఒడిశా నుంచి విశాఖపట్నం బయలుదేరారు. రెండు వాహనాల్లో మొత్తం 14 మంది వెళ్తుండగా.. దారి మధ్యలో కాలకృత్యాల కోసం ఒక వాహనాన్ని ఆపారు. కాసేపు తర్వాత వాహనం ఎక్కేందుకు ప్రయత్నించగా.. వెనుక నుంచి లగేజీ వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురు దుర్మరణం చెందారు. మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. మృతుల్లో తండ్రీ, కుమార్తె ఉండడంతో.. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాడు సమీపంలో మంగళవారం ఉదయం 5గంటల సమయంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా బరంపురం ప్రాంతానికి చెందినగోకుల్ పండా(33), మిసినీపూర్‌కు చెందిన సంతోషి సాబతో(4), సుశాంత్‌కుమార్ సాబతో(44) మృతి చెందారు. సుశాంత్‌కుమార్ సాబతో, సంతోషి సాబతో తండ్రీ కుమార్తెలు. వీరితోపాటు బరంపురం నుంచి రెండు కుటుంబాలకు చెందిన మొత్తం 14 మంది విశాఖపట్నంలోని సింహాచలంలో దైవదర్శనానికి రెండు వాహనాల్లో మంగళవారం వేకువజామున బయలుదేరారు. ఉదయం 5గంటల సమయంలో కోటబొమ్మాళి మండలం ఎత్తురాళ్లపాడు సమీపంలో కాలకృత్యాలకు రోడ్డు పక్కన ఒక వాహనాన్ని నిలిపారు. కాలకృత్యాలు అనంతరం వారు కుడివైపు నుంచి వాహనం ఎక్కుతుండగా వెనుక నుంచి ఓ లగేజీ వ్యాన్ ఆగి ఉన్న వీరి వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో గోకుల్ పండా, సంతోషి సాబతో, సుశాంత్‌కుమార్ సాబతోకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన 108 వాహనంలో శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గమధ్యంలోనే గోకుల్ పండా, సంతోషి సాబతో, సుశాంత్‌కుమార్ సాబతో మృతి చెందారు. సీఐ శ్రీనివాసరావు, నందిగాం ఎస్ఐ షేక్‌అహ్మద్ ఆలీ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతులు, క్షతగాత్రుల (మిగతా 6వ పేజీలో..)

దొరికిన డ్రగ్స్ దొంగలు!

- మూడు నెలల కిందట రెడ్డీస్ ల్యాబ్‌లో భారీ చోరీ
- ఎట్టకేలకు ఛేదించిన పోలీసులు?

రణస్థలం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం రెడ్డీస్ ల్యాబ్‌లో సుమారు మూడు నెలల కిందట మాయమైన డ్రగ్స్ కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించినట్టు తెలుస్తోంది. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పోలీసులు లోతైన దర్యాప్తు చేశారు. ఇందులో కొందరు ఇంటి దొంగలు ఉన్నట్టు (మిగతా 7వ పేజీలో..)

సాగరతీరం.. యోగానందం 6లో


కె.మత్స్యలేశంలో యోగాసనాలు..

అంబరం సిరి సంబరం

- వైభవంగా పెద్దమ్మవారు, నూకాలమ్మ ఉత్సవాలు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- భక్తజన సంద్రమైన పాతశ్రీకాకుళం

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పాత శ్రీకాకుళం గ్రామదేవతలు పెద్దమ్మవారు, నూకాలమ్మ సిరిమానోత్సవాలు మంగళవారం ఉదయం వైభవంగా జరిగాయి. నూకాలమ్మ సిరిమానును నక్క వీధికి చెందిన పూజారి పొలమూరు అచ్యుతరావు, పెద్దమ్మవారు సిరిమానును పూజారి మాపూరు కుమార్ అధిరోహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమైన సిరిమానుల ఊరేగింపు దేశెల్ల వీధి, నక్క వీధి, దండి వీధి, సంతోషిమాత కూడలి, మా పూరు వారి వీధి, బాదుర్ల పేట, కొత్తపేట, కునుకుపేట వరకు సాగింది. అనంతరం తిరిగి జిల్లా పరిషత్‌కు చేరుకుంది. సిరిమానులపై కూర్చున్న పూజారులపై భక్తులు అరటి పండ్లు, నాణేలు విసిరి మొక్కులు చెల్లించారు. వర్షం పడుతున్నా లెక్క చేయకుండా భక్తులు పెద్ద సంఖ్యలో సిరిమానోత్సవంలో పాల్గొన్నారు. ప్రతి ఇంటి నుంచి ఘటాలను అమ్మవార్ల దగ్గరికి తీసుకువెళ్లి దీపాలు వెలిగించారు. పరమాన్నం, అట్లు, బొబ్బట్లు, గారెలు, పులిహోర, పప్పు, అన్నం నైవేద్యంగా పెట్టారు. అలాగే, నక్కవీధి, దండి వీధిలో ప్రత్యేకంగా రథాలు తయారు చేశారు. ఒక రథంపై జాలారి వేష ధారణలో ఉన్న వ్యక్తి కూర్చున్నారు. రెండో రథంపైన మహిషాసుర మర్దిని విగ్రహం పెట్టి ఊరేగింపు నిర్వహించారు. కోలాటం, తప్పెట గుళ్లు, సిరిసిరి నృత్యం, బండ్ల వేషధారణలు, పులి వేషా లు, చెక్క భజన, బిందెల డాన్స్, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ పెద్దమ్మవారు, నూకాలమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు.


ఘటాలతో ఊరేగింపు


ఆకట్టుకున్న కోలాటం, కాళికా నృత్యాలు




సిరిమానోత్సవంలో భక్తజనం


ఘటాలతో చిన్నారులు


ప్రత్యేక ఆకర్షణగా కాంతార నృత్య ప్రదర్శన

బదిలీ అయిన ఏడీఏలు వీరే..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎల్.వెంకటమధు	పలాస	నరసన్నపేట
ఎల్.విజయ	కొత్తవలస	డీటీసీ (శ్రీకాకుళం)
కె.రవీంద్రభారతి	నరసన్నపేట	డీఏవో (శ్రీకాకుళం)
జి.సత్యవతి	ఎస్‌టీఎల్ (ఆమదాలవలస)	సాలూరు
కె.కృష్ణారావు	డీటీసీ (శ్రీకాకుళం)	ఎస్‌టీఎల్ (ఆమదాలవలస)
టి.భవానీశంకర్	డీఏవో (శ్రీకాకుళం)	సోంపేట
బీవీ.తిరుమలరావు	టెక్కలి	చింతపల్లి
కె.జగన్మోహన్‌రావు	సోంపేట	టెక్కలి
ఎం.రామారావు	అనకాపల్లి	పలాస

ఏడీఏలకు స్థానచలనం

నరసన్నపేట/ టెక్కలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయశాఖకు చెందిన తొమ్మిది మంది ఏడీఏలకు బదిలీ అయింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడీఏలుగా పనిచేస్తున్న ఎల్.వెంకటమధుకు పలాస నుంచి నరసన్నపేటకు, ఎల్.విజయకు కొత్తవలస నుంచి శ్రీకాకుళం(డీఏవో)కు, కె.రవీంద్రభారతికు నరసన్నపేట.



దైవ దర్శనానికి వెళ్తూ..

(ఐదో పేజీ తరువాయి)

వివరాలు ఆరా తీశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నందిగాం ఎస్ఐ షేక్‌అహ్మద్ ఆలీ తెలిపారు. మృతదేహాలకు శ్రీకాకుళం రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించామన్నారు. తండ్రీ కూతుళ్ల సుశాంత్‌కుమార్ సాబతో, సంతోషి సాబతో మృతితో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

ప్రమాదానికి గురైన బొలేరో వాహనం

ఇంకెన్నాళ్లీ చావులు?

(ఐదో పేజీ తరువాయి)

ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి డయాలసిస్ బాధితులకు వాహన సదుపాయం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

కారణాలు వెలికితీయాలి..



ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధి వ్యాప్తికి గల కారణాలు వెలికితీయాలి. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. సుజల ధార నీటిని ప్రతీ కుటుంబానికి 20 చొప్పున ఉచితంగా అందించాలి. టీడీపీ హయాంలో రూ.2 ఉన్న 20 లీటర్ల నీటిక్యాన్‌ను వైసీపీ ప్రభుత్వం రూ.7కి పెంచడంతో భారమవుతోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉచితంగా నీటిని సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలి.

-బర్రి పురుషోత్తం, అక్కుపల్లి

గ్రామాల్లో అవగాహన అవసరం..



కిడ్నీవ్యాధి నియంత్రణలో భాగంగా గ్రామాల్లో అవగాహ న సదస్సులు ఏర్పాటు చేయాలి. వైద్యశిబిరాలు నిర్వహించి.. ప్రతి ఒక్కరికీ రక్త పరీక్షలు చేయాలి. వ్యాధి ప్రబలడానికి గల కారణాలు వెలికితీయాలి. ప్రాథమిక దశలో వ్యాధిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలి.

-కోనారి గణపతి, బోటనీ అధ్యాపకుడు

సాగరతీరం.. యోగానందం

- కె.మత్స్యలేశం బీచ్‌లో 'యోగాంధ్ర'
- సందడిగా ఆసనాలు

గార, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కె.మత్స్యలేశం బీచ్ వందలాది మంది యోగా సాధకులతో పులకించింది. మంగళవారం ఉదయం నిర్వహించిన యోగాంధ్ర ఆద్యంతం సందడిగా సాగింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బీచ్‌లో యోగాంధ్ర నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే మంగళవారం ఉదయం ఉరుములు మెరుపులతో వర్షం కురవడంతో తీరంలో యోగా సాధన సాధ్యపడలేదు. దీంతో పక్కనే ఉన్న బుద్దా స్కూల్‌లో యోగాంధ్ర నిర్వహించారు. యోగా మాస్టర్ల పర్యవేక్షణలో ఆసనాలు, ప్రాణాయామం తదితర సాధనాలు విజయవంతంగా ముగిసింది. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ సుధాకర్, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీపీవో, ఎంపీడీవో ఎస్.రామ్మోహన్‌రావు, తహసీల్దార్ ఎం.చక్రవర్తి, సర్పంచ్ బుద్దా లలిత, స్కూల్ చైర్మన్ బి.ఎర్రన్నతోపాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.


యోగా సాధన చేస్తున్న ప్రజలు

కుండపోత

- జిల్లాలో భారీ వర్షం
- ఈదురుగాలుల బీభత్సం
- కూలిన చెట్లు, నీట మునిగిన రోడ్లు

జిల్లాలో మంగళవారం ఉదయం భారీ వర్షం కురిసింది. శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, ఎల్.ఎన్.పేట, ఆమదాలవలస, పోలాకి, జి.సిగడాం, సరుబుజ్జిలి, పాతపట్నం, నందిగాం, తదితర మండలాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వాన పడింది. దీంతో పలు చోట్ల చెట్లు నేలకూ లాయి. రోడ్లు జలమయయ్యాయి. ఈదురు గాలులకు జి.సిగడాం మండలం గొబ్బూరు రచ్చబండ, రామమందిరం వద్ద చెట్లు కూలిపోయాయి. చెట్ల కొమ్మలు విరిగి రేకుల షెడ్‌పై పడ్డాయి. ఆ సమయంలో ఎవరూ లేకపోవ డంతో పెద్ద ప్రమాదం తప్పింది. పంట పొలాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. టెక్కలి పట్టణంలోని శ్రీనివాస్‌నగర్, ఎన్టీఆర్ కాలనీ, మండాపొలం కాలనీ రోడ్లపై వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడ్డారు. నరసన్నపేట మండలంలో కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఉర్లాం, కంబకాయి. మాకివలస, కోమర్తి, నడగాం, చోడవరం తదితర ప్రాంతాల్లోని పొలాల్లో వరదనీరు చేరింది. దీనివల్ల వేసవి దుక్కులకు ఆటంకంగా మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఆమదాలవలస మండలం కనుగులవలస వద్ద ఉన్న రైల్వే అంతరమార్గం వర్షపు నీటితో నిండిపోయింది. దీంతో కలివరం ముద్దాడపేట, తమ్మయ్యపేట, దూసిపేట గ్రామాల నుంచి ఆమదాలవలస పట్టణానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఆమదాలవలస మండలంలోని దివంజిపేట రోడ్డు పూర్తిగా జలమయమైంది. గోతుల్లో నీరు చేరడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బదుందులుపడ్డారు. శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ పూర్తిగా జలమయమై చెరువును తలపించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలోని పలు రోడ్లు కూడా వర్షపు నీటితో నిండిపోయాయి. -(ఆంధ్రజ్యోతి బృందం)


నరసన్నపేట: గొట్టిపల్లి వద్ద పొలాల్లో చేరిన నీరు


జి.సిగడాం: గొబ్బూరులో నేల కూలిన భారీ వృక్షం


చెరువులా మారిన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్


ఆమదాలవలస: వర్షపు నీటితో నిండిన కనుగులవలస రైల్వే అండర్‌పాసేజ్


ఆమదాలవలస: చెరువును తలపిస్తున్న దివంజిపేట రోడ్డు


టెక్కలి: శ్రీనివాసనగర్‌లో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు

కవిటిలో డాగ్‌స్క్వాడ్ తనిఖీ


తనిఖీలు చేస్తున్న పోలీసులు

కవిటి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మత్తు పదార్థాలను అరికట్టే క్రమంలో కవిటిలో పోలీసులు మంగళవారం డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్, దుకాణాల సముదాయాల వద్ద క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్ఐ వి.రవివర్మ ఆధ్వర్యంలో కవిటిలోని పలుప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలను అరికట్టేందుకు తనిఖీలు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ముగిసిన ఐటీఐ అడ్మిషన్ కౌన్సెలింగ్

ఎచ్చెర్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో వివిధ ట్రేడుల్లో ప్రవేశానికి ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 5వ తేదీ నుంచి నిర్వహిస్తున్న అడ్మిషన్ కౌన్సెలింగ్ మంగళవారంతో ముగిసింది. జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కె.సుధ, జిల్లా ఐటీఐ అడ్మిషన్ల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు పర్యవేక్షణలో ఈ కౌన్సెలింగ్ జరిగింది. ఐటీఐలో అడ్మిషన్ల కోసం 1,035 మంది దరఖాస్తు చేశారు. ఇందులో మొత్తం 710 మంది కౌన్సెలింగ్‌కు హాజరుకాగా 391 మంది వివిధ ఐటీఐల్లో సీట్లు పొందారు. జిల్లాలోని మూడు ప్రభుత్వ ఐటీఐల్లో 640 సీట్లు, 20 ప్రైవేటు ఐటీఐల్లో 2,872 సీట్లు ఉన్నాయి. తొలి విడతలో అడ్మిషన్లు స్వల్పంగానే జరిగాయి.

రక్తదానంపై అవగాహన కల్పించాలి

ఎచ్చెర్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని వెంకటేశ్వర ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఈవీ నాగోజీ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్, బ్లడ్ బ్యాంకు సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఏవో బి.తిరుపతిరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.చిట్టిబాబు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్య కుమార్, ఎన్.ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి 226 మంది హాజరు

ఎచ్చెర్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల నియామకానికి నిర్వహిస్తున్న మెగా డీఎస్సీ కొనసాగు తుంది. శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల) లో మంగళవారం జరిగిన ఈ పరీక్షలకు ఉదయం షిఫ్ట్ లో 144కు 130 మంది, రెండో షిఫ్ట్‌లో 100కు 96 మంది హాజరయ్యారు. రెండు షిఫ్ట్‌ల్లో కలిపి 244కు 226 మంది హాజరు కాగా, 18 మంది గైర్హాజరయ్యారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

కంచిలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పోలేరులో రూ.45 లక్షలతో నిర్మాణం చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు టీడీపీ నాయకులు మాదిన రామారావు, బంగారు కురయ్య మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో వి.రమేష్‌రెడ్డి, పూర్ణచంద్ర బిసోయ్, భాస్కరరావు, మన్మథరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

జి.సిగడాం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో జి.రామకృష్ణ అన్నారు. మంగళవారం వాండ్రంగిలో నిర్వహించిన కిషోర్ వికాశ వేసవి శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. యుక్తవయస్సు గల బాలికలు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.లక్ష్మి, ఏఎన్ఎం ఎ.అన్నపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోరబాలికలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

ఇచ్ఛాపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను నిర్మూలించడం మనందరి బాధ్యతని పురుషోత్తపురం 2వ వార్డు కౌన్సిలర్ చాట్ల పుష్ప, మహిళా సంరక్షురాలు సూర్యకుమారి అన్నారు. మంగళవారం పురుషోత్తపురం ఉన్నత పాఠశాలలో పిల్లల తల్లిదండ్రులకు బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలు, అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సుబ్బలక్ష్మి, సుజాత, త్రివేణి, హేమావతి, ఢిల్లేశ్వరి, వరలక్ష్మి, ఆమని గ్రామ పెద్దలు కృష్ణ, చాట్ల తిరుపతి, పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేయాలి

సరుబుజ్జిలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ పద్ధతుల్లో వరిసాగు చేస్తే ఆశించిన దిగుబడి సాధించవచ్చని రాగోలు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త మధుకుమార్ తెలిపారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పురుషోత్తపురంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్త తమ్మినేని రాజశేఖర్, గ్రామ పెద్దలు కిల్లి లక్ష్మణరావు, కిల్లి సిద్ధార్థ, లక్ష్మీగోవిందరావు, రైతులు పాల్గొన్నారు.

మిన్నంటిన నిరసనలు

- రాజధాని మహిళలను కించపరచడంపై ఆందోళనలు
- జిల్లా వ్యాప్తంగా రోడ్డెక్కిన మహిళలు

రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలను కించపరిచేలా డిబేట్ పెట్టిన సాక్షి చానెల్‌ను తక్షణమే బ్యాన్ చేయాలని పలువురు డిమాండ్ చేశారు. తెలుగు మహిళల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

ఆమదాలవలస, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను కించపరిచిన సాక్షి యాజమాన్యాన్ని తక్షణమే అరెస్టు చేసి, చానెల్ బ్యాన్ చేయాలని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, సీనియర్ న్యాయవాది కణితి విజయలక్ష్మీ బాయి, ఎన్ని శ్రీదేవి, సిమ్మ మాధవి, బోయిన సునీత, గుడ్ల రాజ్యలక్ష్మి, కూన వెంకట రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం నుంచి ప్రధాన రహదారిలో ర్యాలీగా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఎస్ఐ బాలరాజుకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు, పార్టీ నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, తాడేల రాజారావు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


అరసవల్లి: నగరంలో మహిళల నిరసన ప్రదర్శన

మానవ సమాజానికే సిగ్గుచేటు

అరసవల్లి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలపై సాక్షి టీవీలో జర్నలిస్టు వీవీఆర్ కృష్ణంరాజు, యాంకర్‌గా వ్యవహరించిన కొమ్మినేని శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలు మానవ సమాజానికే సిగ్గుచేటని శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతీశంకర్ విమర్శించారు. ఇటువంటి చర్యలు మళ్లీ పునరావృతం కాకుండా అడ్డుకట్ట వేయాలని, అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం స్థానిక సూర్యమహల్ కూడలి నుంచి ఏడురోడ్ల జంక్షన్ వరకు మహిళలు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రెడ్డి గిరిజాశంకర్, శవ్వాన ఉమామహేశ్వరి, కవ్వాడి సుశీల, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


పొందూరు: పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

గళమెత్తిన మహిళాలోకం

పొందూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతి మహిళలపై సాక్షి చానెల్‌లో అనుచితవ్యాఖ్యలు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళలు గళమెత్తారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రం పొందూరులో అనలిస్ట్ ముసుగులో ఉన్న వైసీపీ సైకో కృష్ణంరాజు, యాంకర్ కొమ్మినేని శ్రీనివాస్ వ్యాఖ్యలపై నిరసన తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీలో మహిళలకు గౌరవంలేదని మరోసారి రుజువైందని సర్పంచ్ రేగిడి లక్ష్మి అన్నారు. నా అక్కచెల్లెల్లు, అమ్మలు అని కపటప్రేమను కురిపించే జగన్‌రెడ్డి తన చానెల్‌లో మహిళలను వేశ్యలంటూ దుర్భాషలాడితే ఎందుకు స్పందించలేదని ఎంపీటీసీ ఎ.వాణి, మాజీ సర్పంచ్ ఎ.విజయలక్ష్మి, టీడీపీ నాయకులు బలగ రాధాకుమారి ప్రశ్నించారు. ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నిరసన తెలిపారు. మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినవారిపైనా, దీనికి వేదికైన సాక్షి చానెల్ యాజమాన్యంపైనా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో, తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో వైసీపీకి చెందినవారు తప్ప. అన్ని పార్టీలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.


ఆమదాలవలస: ప్రధాన రహదారిలో ర్యాలీగా వెళ్తున్న మహిళలు

పాతపట్నంలో నిరసన


పాతపట్నం: ర్యాలీలో పాల్గొన్న మహిళలు

పాతపట్నం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను కించపరిచిన వ్యక్తులు, ప్రసారం చేసిన సాక్షి చానల్‌పై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పాతపట్నంలో భారీ ర్యాలీ, నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఆల్ ఆంధ్రా రోడ్డు కూడలి వరకు ర్యాలీ చేపట్టారు. సాక్షి పత్రికలను దహనం చేశారు. సాక్షి చానల్‌లో ప్రసారం చేసిన డిబేట్‌లో మహిళల మనోభావాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళలతో పాటు బీజేపీ, జనసేన మహిళా నేతలు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు దారుణం

పలాస, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలను కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు, కేఎస్ఆర్‌తో పాటు సాక్షి మీడియాపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పలాస టీడీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కాశీబుగ్గ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టిన అనంతరం మానవహారం నిర్వహించారు. సాక్షి దినపత్రికలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు మాట్లాడుతూ.. అమరావతిని రాజధానిగా ప్రకటించిన నాటి నుంచి సాక్షి పత్రిక, చానల్ విషం చిమ్ముతూనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, నేతలు గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్‌గుప్తా, బడ్డ నాగరాజు, గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్, దువ్వాడ శ్రీకాంత్, ఎం.నరేంద్ర, ఎ.రామకృష్ణ, కొత్త సత్యం, సూరాడ మోహనరావు, రట్టి లింగరాజు, పైల చక్రధర్, పలువురు తెలుగు మహిళలు పాల్గొన్నారు.


పలాస: ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నేతలు వెంకన్న చౌదరి, వజ్జ బాబూరావు తదితరులు

మొబైల్ పోతే సీఈఐఆర్ ద్వారా ఫిర్యాదు చేయాలి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి
- 505 ఫోన్లు రికవరీ.. బాధితులకు అందజేత


బాధితురాలికి మొబైల్ ఫోన్ అందిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్లు పోయిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సూచించారు. సుమారు రూ.80 లక్షలు విలువైన 505 మొబైల్ ఫోన్లను మంగళవారం బాధితులకు జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గత నాలుగు నెలలుగా వివిధ కారణాలతో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్టు తెలిపారు. మరికొంత మేరకు రికవరీ చేయాల్సి ఉందని, ఇప్పటికే తొమ్మిది విడతలుగా రికవరీ చేసినఫోన్లను బాధితులకు అందజేశామని, ఇప్పుడు పదో విడతగా 505 ఫోన్లను బాధితులకు అప్పగించామన్నారు. వీటివిలువ సుమారు రూ.80 లక్షలు ఉంటుందన్నారు. మొబైల్ ఫోన్లు వాడే ప్రతి ఒక్కరూ ఫోన్‌లో సెక్యూర్టీ లాక్ వేసుకోవాలని సూచించారు. ఏఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో ఫోన్ల అతితక్కువ కాలంలోనే ఛేదించడంపై సైబర్, ఐటీ సెల్ సీఐ, సీసీఎస్ సీఐ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ కేవీ రమణ, సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్, సైబర్ సెల్ ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

కంచిలి మండల సమావేశం రేపు

కంచిలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 12వ తేదీ గురువారం ఉదయం 10.30గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.తిరుమలరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ దేవదాస్ రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలని, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

కొనసాగుతున్న ఏపీ పీజీ సెట్

ఎచ్చెర్ల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పీజీ కోర్సుల్లో సీట్ల భర్తీకి నిర్వహిస్తున్న ఏపీ పీజీ సెట్ కొనసాగుతున్నాయి. ప్రతిరోజు మూడు షిఫ్ట్‌లో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. రెండో రోజైన మంగళవారం శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో నిర్వహించిన ఈ పరీక్షల్లో మూడు షిఫ్ట్‌ల్లో కలిపి 705 మందికి 580 మంది హాజరయ్యారు.

మహిళలకు రక్షణ కరువు

శ్రీకాకుళం అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎంవీ పద్మావతి ఆరోపించారు. సోమవారం జిల్లా వ్యాప్త నిరసనలో భాగంగా శ్రీకాకుళం అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. కార్య క్రమంలో వైసీపీ నాయకులు అంబటి నిర్మల, టి.కామేశ్వరి, సుగుణ, అంబటి శ్రీనివాస్, బొడ్డేపల్లి రమేష్‌కుమార్, శ్రీధర్, మూకళ్ల తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నూతన కార్యవర్గానికి అభినందన


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న విప్ అశోక్

ఇచ్ఛాపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మండల నూతన కార్యవర్గ సభ్యులను ప్రభుత్వ విప్, నియోజకవర్గ ఎమ్మెల్యే బెందాళం అశోక్ అభినందించారు. మంగళవారం రామయ్యపుట్టుగలో విప్‌ను నూతన కార్యవర్గ సభ్యులు కలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లోపింటి పద్మనాభం, కార్యదర్శి దక్కత కామేష్, ఉపాధ్యక్షుడు బాబ్జీ, పి.దుర్యోధన, నాయకులు మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, సహదేవ్‌రెడ్డి, సూర్యనారాయణ, దక్కత రామారావు, లోహిదాస్, ఆశి మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడేవారికి పార్టీలో తగిన గుర్తింపు: ఎంపీ కలిశెట్టి


శ్యామలరావును అభినందిస్తున్న ఎంపీ కలిశెట్టి

రణస్థలం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడేవారికి తగిన గుర్తింపు ఉంటుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేసేవారికి మంచి భవిష్యత్ ఉంటుందని, దానికి ఉదాహరణ తానేనని అన్నారు. కార్యకర్తల మధ్య చిన్నచిన్న మనస్పర్ధలు ఉంటే అన్నదమ్ముల వలే పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడిగా లంక శ్యామలరావు, ప్రధాన కార్యదర్శిగా మండపాక కనకారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డీజీఎం ఆనందరావు, పిసిని జగన్నాథంనాయుడు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము తదితరులు పాల్గొన్నారు.

చెరువులు కాదు.. మైదానాలే!

(ఐదో పేజీ తరువాయి)

మైదానాలు కూడా సక్రమంగా లేవని వాపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం క్రీడా రంగాన్ని పూర్తిగా విస్మరించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని ప్రకటించింది. పనులు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. చిన్న వర్షం కురిస్తే చాలు.. ఈ క్రీడా మైదానం చెరువును తలపిస్తోంది. ఎక్కడికక్కడ నీరు నిలిచిపోవడంతో దోమలకు ఆవాసంగా మారుతోంది. శ్రీకాకుళంలో క్రీడాకారులకు మరో పెద్ద దిక్కుగా ఉన్న ప్రభుత్వ పురుషుల కళాశాల మైదానంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కోడిరామ్మూర్తి స్టేడియానికి రక్షణ గోడ లేకపోవడంతో మందుబాబులు రాత్రివేళల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొంతమంది అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఆర్ట్స్ కళాశాల మైదానానికి రక్షణ గోడ ఉన్నా.. మందుబాబులు రాత్రివేళలో హల్‌చల్ చేస్తున్నారు. ఎక్కడికక్కడ మందుసీసాలు పడేయడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో గాజు పెంకులు గుచ్చుకుని గాయాల పాలవుతున్నారు. క్రీడా మైదానాలను అభివృద్ధి చేయాలని, రక్షణ గోడలు నిర్మించాలని, సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు. ఈ దిశగా అధికారులు, పాలకులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దొరికిన డ్రగ్స్ దొంగలు!

(ఐదో పేజీ తరువాయి)

సమాచారం. మధుమేహ వ్యాధిగ్రస్థులకు సంబంధించి మాలిక్యూల్ పౌడర్ తరహాలో ఒక మందును రెడ్డీస్ ల్యాబ్ అభివృద్ధి చేసింది. అత్యాధునిక పరిశోధనతో ఈ మందును కనుగొంది. ఇది మాలిక్యూల్ పెప్టైడ్ తరహాకు చెందినది. విస్తృత పరిశోధనలు తరువాత దీనిని పౌడర్ రూపంలో తయారుచేశారు. టైప్ 2 మధుమేహాన్ని ఇట్టే నియంత్రించగలిగిన విధంగా దీనిని రూపొందించినట్టు తెలుస్తోంది. ఈ సొంత ఫార్ములా కోసం యాజమాన్యం రూ.కోట్ల ధనాన్ని కేటాయించింది. అయితే వేర్వేరు ప్యాకెట్ల రూపంలో 450 గ్రాముల పౌడర్‌ను రెడ్డీస్ ల్యాబ్‌లోని కూలింగ్ యూనిట్‌లో అత్యంత భద్రత, నిఘా నడుమ ఉంచారు. ఫిబ్రవరి 17న దానిని భద్రపరచగా.. మార్చి 3న అదృశ్యమైనట్టు గుర్తించారు. ఇది విద్రోహ చర్య? లేకుంటే ఇంటి దొంగల పనా? అన్న కోణంలో జేఆర్ పురం పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం అన్నికోణాల్లో దర్యాప్తు పూర్తయినట్టు తెలుస్తోంది. నిందితులు పోలీసులు అదుపులో ఉన్నట్టు సమాచారం.

చింతామణి అమ్మవారికి పూజలు


అర్జునాపురంలో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కంచిలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అర్జునాపురం గ్రామంలో చింతామణి అమ్మవారి చల్లదనం కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గజముద్దలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ ఊరేగింపు నిర్వహించారు. అలాగే కంచమ్మతల్లి సంబరాల సందర్భంగా అమ్మవారిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ మంగళవారం దర్శించుకున్నారు. పూజా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్‌ను సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ నర్తురామారావు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

ఘనంగా అసిరిపోలమ్మ సంబరం


అమ్మవారి ఘటాలతో ఊరేగింపు

ఇచ్ఛాపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బూర్జుపాడు గ్రామ దేవత అసిరి పోలమ్మతల్లి సంబరాన్ని మంగళవారం ట్రాక్టర్ ఓనర్స్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గజముద్దలను మేళతాళాలు, కాళికా నృత్యాలతో ఊరేగించి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు జగన్నాథ స్వామి చందనోత్సవం

పట్టణంలోని జగన్నాథస్వామి చందనోత్సవం బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్ద జగన్నాథస్వామి, చిన్న జగన్నాథస్వామి ఆలయాల్లో దేవదాయశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేకువ జామున ఆలయ నుంచి జ్యేష్ఠ మండపానికి ఉత్సవమూర్తులను తీసుకువచ్చి కొలువు తీరుస్తారు. ఉదయం 10గంటలకు అభిషేకాలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా వివిధ నదీ జలాలు, సముద్రజలాలతో స్వామి వారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేస్తారు.

ముగిసిన దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం


తిరువీధిలో పాల్గొన్న భక్తులు

జి.సిగడాం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పెంట గ్రామంలో వెలసియున్న కనక దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా గ్రామ పురవీధుల్లో వైభవంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాల తిరివీధి నిర్వహించారు. వందలాది మంది భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ధర్మకర్త డోల రామారావు, రామలక్ష్మి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కంచమ్మ తల్లి ఊరేగింపులో న్యాయాధికారులు

కంచిలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కంచమ్మతల్లి సంబరాల చివరి రోజు సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపులో సోంపేట కోర్టు న్యాయాధికారి కిషోర్‌బాబు దంపతులు, జూనియర్ న్యాయాధికారి శ్రీనివాస్ దంపతులు పాల్గొన్నారు. ఈసందర్భంగా దీపాలు వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించిన పూజలు చేశారు. న్యాయాధికారులకు పూజా కమిటీ ఆధ్వర్యంలో సత్కరించి అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో సోంపేట, ఇచ్ఛాపురం సీఐలు బి.మంగరాజు, చిన్నంనాయుడు, ఎస్ఐ పారినాయుడు, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.


ఊరేగింపులో పాల్గొన్న న్యాయాధికారులు, సీఐలు

'ఎత్తిపోతల'కు రూ.11.87 కోట్లతో ప్రతిపాదన

● సాగునీరందించేందుకు మంత్రి అచ్చెన్న చొరవ

టెక్కలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో రైతులు పడరాని పాట్లు పడ్డారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలి నియోజకవర్గంలో 12 ఎత్తిపోతల పథకాల ద్వారా 18 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు అవసరమైన చర్యలను ప్రారంభించారు. కొన్ని ఎత్తిపోతల పథకాలు మరమ్మతులు కావడం, మరికొన్ని పథకాలకు అదనంగా పైప్‌లైన్లు వేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. వీటికోసం రూ. 11.87 కోట్లు అవసరమని గుర్తించి అవసరమైన ప్రతిపాదనలు అధికారులు సిద్ధం చేశారు. వంశధార ఆయకట్టు పరిధిలో మదన గోపాలసాగరాన్ని అభివృద్ధి చేసే దిశలో నీటిపారుదల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఈ ప్రాంతాన్ని పరిశీలించడంతో నిధుల విడుదలకు అవకాశం లభించింది. ఈ ఖరీఫ్ నుంచే పలు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీరందించే దిశగా ఏపీఎస్ఎస్ఐడీసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు.


మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకం

నిధుల అవసరం ఇలా..

నియోజకవర్గంలోని పలు ఎత్తిపోతల పథకాలకు ఏ మేరకు నిధులు అవసరమో గుర్తించారు. ఆ వివరాలి లా.. చిన్నసాన ఎత్తిపోతల పథకానికి రూ.1.28 కోట్లు, మదన గోపాలసాగ రానికి రూ.4.8 కోట్లు, పోలవరం పథకానికి రూ.33 లక్షలు, నారాయణవలస పథకానికి రూ.20 లక్షలు, పెద్దబమ్మిడి ఎత్తిపోతలకు రూ.40 లక్షలు, కొత్తపేట పథకానికి రూ.24లక్షలు, సుభద్రా పురం పథకానికి రూ.22 లక్షలు, సౌడాం ఎత్తిపోతలకు రూ.61లక్షలు అవసరమని గుర్తించారు. అలాగే కురుడు పథకానికి రూ.2.28 కోట్లు, శ్రీపురం ఎత్తిపోతలకి రూ. 1.21 కోట్లు, నారాయణపురం పథకానికి రూ.39 లక్షలు, పొడుగు పాడు ఎత్తిపోతల పథకానికి రూ.63 లక్షలు అవసర మని సంబంధిత అధికారులు గుర్తిం చారు. ఎత్తిపోతల పథకాల ద్వారా టెక్కలి నియోజక వర్గానికి పూర్తిస్థాయి సాగునీరందించే దిశగా మంత్రి అచ్చెన్నా యుడు చర్యలు చేపట్టడంపై పలు గ్రామాల రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

హత్యాయత్నం కేసులో నాలుగేళ్ల జైలు

సోంపేట/శ్రీకాకుళం లీగల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఆస్తితగాదాలో బారువకు చెందిన నాయని యోగేశ్వరరావుకు సోంపేట అడిషనల్ సెషన్సు కోర్టు న్యాయాధికారి జె.శ్రీనివాసరావు నాలుగేళ్ల జైలుశిక్ష విధించినట్టు సీఐ మంగరాజు మంగళవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. ఆస్తితగాదాలో తెప్పల కృష్ణారావుపై 2016 జూలై 26న యోగేశ్వరరావు దాడికి పాల్ప డ్డాడు. అప్పటి ఎస్ఐ ఈ.శ్రీనివాసరావు కేసు నమోదుచేసి విచారణ చేపట్టి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం న్యాయాధికారి జె.శ్రీనివాసరావు మంగళవారం తీర్పునిచ్చారు. ఈ మేరకు నిందితుడు నాయని యోగేశ్వరరావుకు నాలుగేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.1000 జరిమానా విధించారు. జరిమానా కట్టకుంటే మరో మూడు నెలల సాధారణ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో ఉమ్మడి దాడులు

టెక్కలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో సారా తయారీ, అమ్మకాలపై ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా మంగళవారం దాడులు నిర్వహించారు. శ్రీకాకుళం ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ సీహెచ్ తిరుపతినాయుడు, ఒడిశా రాష్ట్రం గంజాం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్లు ఈ దాడుల్లో పాల్గొన్నారు. సింగిపూర్ గ్రామంపై ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ ఎక్సైజ్ ప్రదీప్‌కుమార్ సాహు ఆధ్వర్యంలో దాడులు చేసి 2,600 లీటర్ల పులిసిన బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. 200 లీటర్ల సారాని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్లు పాతపట్నం ఇన్‌స్పెక్టర్ కోట కృష్ణారావు తెలిపారు.

డ్రైవర్ చాకచక్యంతో తప్పిన ప్రమాదం


రోడ్డు పక్కన దిగబడిపోయిన లారీ

ఎల్.ఎన్.పేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అలికాం-బత్తిలి ప్రధానరోడ్డు పక్కన అధిక లోడుతో వెళ్తున్న లారీ పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు పక్కన దిగబడిపోయింది. ప్రమాదాన్ని గమనించిన డ్రైవర్ చాకచక్యంతో లారీ వెళ్లకుండా నిలిపి వేయడంతో ప్రమాదం తప్పింది. సరుబుజ్జిలి వైపు నుంచి హిరమండలం వైపు వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన దిగబడిపోయింది.

జిల్లా కేంద్ర ఆసుపత్రిలో పనిచేయని లిఫ్ట్

టెక్కలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో మూడురోజులుగా లిఫ్ట్ పని చేయడం లేదు. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డయాలసిస్ రోగులు, రక్తపరీక్షలు, ఇన్ పేషెంట్ వార్డులు మొదటి, రెండు అంతస్తుల్లో ఉండడం, లిఫ్ట్ పాడవడంతో రోగులు పడు తున్న ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. తరచూ లిఫ్ట్ మొరాయిస్తోందని, మరమ్మతు చేయడంలో సంబం ధిత అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బొడ్డేపల్లి సూర్యారావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా బ్యాటరీలు మరమ్మతు కారణంగా లిఫ్ట్ నిలిచిపోయిందని, రెండు రోజుల్లో బాగు చేయిస్తున్నట్లు తెలిపారు.

నేలబావిలో దూకి యువతి ఆత్మహత్య


సునీత (ఫైల్)

మెళియాపుట్టి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరియాఖండి గ్రామానికి చెందిన ఎస్.సునీత (19) గ్రామ సమీపంలోని నేలబావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన సునీత రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. బంధువుల ఇళ్లలోనూ వాకబు చేసినా ఫలితం కనిపించలేదు. మంగళవారం సాయంత్రం గ్రామ సమీపంలో పశువులు కాపరులు అటుగా వెళ్లటంతో దుర్గంధం రావడంతో బావిలోకి చూడగా శవం కనిపించింది. గ్రామస్థులకు సమాచారం అందించగా వారు వచ్చి సునీత మృతదేహంగా గుర్తించి ఆమె కుటుంబ సభ్యులకు తెలిపారు. తండ్రి ప్రసాదరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పిన్నింటి రమేష్ బాబు తెలిపారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. శవపంచనామా చేసి మృతి దేహాన్ని పాతపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు శ్రీకాకుళంలో లాబ్ టెక్నీషియన్ కోర్సు చదువుతోంది. 40 రోజులుగా ఇంటి వద్దనే ఉంటోందని కుటుంబ సభ్యులు తెలిపారు.

బంగారం కోసం.. చంపేశారా?

● పెద్దహరిశ్చంద్రపురంలో వృద్ధురాలి హత్య
● మెడలో పుస్తెలతాడు దోపిడీ


దాలమ్మ (ఫైల్)

టెక్కలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కోదండ రామస్వామి ఆలయ వార్షికోత్సవం సందడిగా జరుగుతున్న ఆ గ్రామంలో ఓ వృద్ధురాలి హత్యతో విషాదం నెలకొంది. మెడలో బంగారం ఆభరణాలు దోపిడీ క్రమంలో ఆమెను చంపేశారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనతో గ్రామస్థులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కోటబొమ్మాళి మండలం పెద్దహరిశ్చంద్రపురంలోని కాళింగవీధిలో నివాసం ఉంటున్న దుంపల దాలమ్మ(68) మంగళవారం వేకువజామున హత్యకు గురైంది. ఆ ప్రాంతంలో ఆనవాళ్లు చూస్తే ఆమె మెడలోని బంగారం కోసమే గుర్తుతెలియని వ్యక్తులు ఈ హత్యకు పాల్పడి ఉంటారనే అనుమానం కలుగుతోంది. దాలమ్మ, ఆమె భర్త కృష్ణమూర్తి.. విశాఖ లో కుమారుడు రామారావు దగ్గర ఉంటున్నారు. కోదండ రామాలయం వార్షికోత్సవం నేపథ్యంలో రెండు రోజుల కిందటే దాలమ్మ గ్రామానికి చేరుకుంది. ఆమె రోజూ వేకువజామున లేచి పూలు ఏరేది. ఈ క్రమంలో మంగళవారం వేకువజామున 4 గంటలకు ఆమె లేచింది. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె ఇంట్లోకి చొరబడి మెడలో రెండున్నర తులాల పుస్తెలతాడును దొంగిలించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో వారిద్దరి మధ్య పెనుగులాట జరగ్గా.. ఆమె తలపై రక్తస్రావమై.. అక్కడికక్కడే మృతి చెందింది. వేకువజామున ఉరుములు.. మెరుపులతో వర్షం కురవగా.. ఆమె అరుపులు బయటకు వినిపించని పరిస్థితి నెలకొంది. మంగళవారం ఉదయం ఆమె విగతజీవిగా కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సత్యనారాయణ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్‌ను రప్పించి వివరాలు సేకరించారు. మృతురాలి కుమారుడు రామారావు ఫిర్యాదు మేరకు కోటబొమ్మాళి ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. దాలమ్మ మృతితో కుమార్తెలు నాగమ్మ, వజ్రం, భర్త కృష్ణమూర్తి రోదిస్తున్నారు. వృద్ధురాలి హత్య సమయంలో మెడలో పుస్తెలతాడు తప్ప ముక్కు, చెవికి ఉన్న బంగారు వస్తువులు చోరీ జరగలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రికి తరలించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక


నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పోలాకి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం కుటుంబ సభ్యుతో కలిసి ఆత్మీయ సమ్మేళ నం నిర్వహించారు. 27 సంవత్సరాల తర్వాత వారంతా కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనందం పొందారు. నాటి గురువులను సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం ఆర్.లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గంగేటి సురేష్, ఎంవీనాయుడు, బరాటం ప్రసాద్, బి.సుమన్, పి.వెంకట్, బి.అప్పన్న, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాధాసాగరంపై వంతెన పనులు ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మెళియాపుట్టి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గోకర్ణపురం గ్రామ సమీపంలో రాధాసాగరం గెడ్డపై వంతెన పనులు మంగళవారం ప్రారం భించారు. ఒడిశాలో వర్షాలు పడితే గ్రామం ముంపునకు గురవుతోందని 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు రావడంతో ప్రభుత్వం రూ.90 లక్షలు నిధులు మంజూ రు చేసింది. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు భూమిపూజ చేశారు. ప్రస్తుతం పనులు ప్రారంభం కావడంతో 35 ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం లభిస్తోందని పలువురు స్థానికులు హర్షం వ్యక్తంచేస్తు న్నారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని అనేందుకు ఈ పనులే నిదర్శనమని సర్పంచ్ రవికుమార్ అన్నారు.

మొక్కలు నాటిన వాకర్స్


మొక్క నాటుతున్న సీనియర్ సిటిజన్లు

టెక్కలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సీనియర్ సిటిజన్లు, వాకర్స్ గ్రూప్ ప్రతినిధులు మంగళవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్లు కర్నిక గాంధీ, సింహాద్రి, సూర్యనారాయణ, హరిశ్చంద్ర రావు, గణపతి, ధవళ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీ విజేతలకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల కటక్‌లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీలో నరసన్నపేట విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. ఈ మేరకు మంగళవారం వారిని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తన కార్యాలయంలో అభినందించారు. ఈ పోటీలో డి.సందీప్ రెడ్డి (బంగారు), వాన ధనుంజయ కృష్ణ, కారి చందు (వెండి), దత్తి మనస్విని, చల్ల అభిరామ్, రావాడ నయన్ హర్షిత (కాంస్యం) పతకాలను సాధించగా.. వారు భవిష్యత్‌లో మరింత రాణించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, చినట్లు కోచ్ ఎర్ర హరి పాల్గొన్నారు.

నివగాంలో ఆక్రమణల తొలగింపు

కొత్తూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కొత్తూరు-హడ్డుబంగి మార్గంలో నివగాంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను మంగళవారం తొలగించారు. రోడ్డు, కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం, ఆర్‌అండ్‌బీ అధికారులు సూచనలతో రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, నిర్మాణాలను తొలగించినట్లు తహసీల్దార్ కె.బాలకృష్ణ తెలిపారు.

రెండు గంటల పాటు ట్రాఫిక్ జామ్

వజ్రపుకొత్తూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పూండి సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ట్రాఫిక్ జామ్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్టాండ్‌కు సమీపంలో ఓ ప్రైవేటు ఫంక్షన్‌ను రోడ్డు సమీపంలో నిర్వహించారు. దీంతో ఈ కార్యక్రమానికి వచ్చిన వారు వాహనాలను రెండు వైపులా నిలిపివేయడంతో బస్సులు, ట్రక్కులు ఎక్కడికక్కడ నిలిచి ఇతర వాహనాలకు మార్గంలేకుండా తయారైంది. దీంతో వాహన దారులు పడిన ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. సుమారు రెండు గంటలు పాటు వాహ నాలు నిలిచి పోవడంతో ఎస్ఐ నిహార్ స్పందించి సిబ్బందితో వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


బస్టాండ్ సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిలిచిన వాహనాలు

న్యూస్ బాక్స్

నేడు మండల సమావేశం

సంతబొమ్మాళి,జూన్10(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం పది గంటలకు ఎంపీపీ మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జయంత్ ప్రసాద్ తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరుకావాలని, అధికారులు పూర్తి వివరాలతో రావాలని కోరారు.

మందసలోనూ..

మందస, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

రేపు నందిగాంలో..

నందిగాం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కుమార్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన జరుగుతుందన్నారు.

బాల్యవివాహాలు నేరం

నరసన్నపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని పంచాయతీ ఈవో ద్రాక్షాయిణి అన్నారు. మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరీ బాలికల తల్లిదండ్రులకు బాల్యవివాహాల నియంత్రణపై అవగాహన కలిగిం చారు.

భాగస్వాములు కావాలి

కొత్తూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నియంత్రణలో ప్రజలు భాగస్వాములై సహక రించాలని కొత్తూరు ఐసీడీఎస్ సూపర్ వైజర్ లింగాల శాంతి కుమారి కోరారు. మంగళవారం మహాసింగి అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరీ వికాసం ముగింపు కార్యక్రమం నిర్వహించారు.

బాల్యవివాహాలు లేని గ్రామాలుగా..

పాతపట్నం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు లేని గ్రామాలను రూపొందించాలని ఐసీడీఎస్ కో-ఆర్డినేటర్ జనార్దన రావు అన్నారు. స్థానిక సచివాలయం-1లో కిశోరీ వికాసం-1 కార్యక్ర మాన్ని మంగళవారం నిర్వహించారు. ఐసీడీఎస్ పీవో చింతాడ ఇందిర పాల్గొన్నారు.

27నుంచి రథయాత్ర

టెక్కలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దబ్రాహ్మణవీధిలో జగన్నాథస్వామి రథయాత్ర ఈనెల 27 నుంచి జూలై 5వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఈవో టీవీ మనస్విని తెలిపారు. జగన్నాథుడు వివిధ అవతారాల్లో దర్శనమిస్తారన్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

నేడు జగన్నాథుడి దేవస్నానం

పలాసరూరల్,జూన్10(ఆంధ్రజ్యోతి): తర్లాకోట జగన్నాథ ఆలయంలో జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా స్వామికి బుధవారం దేవస్నాన వేడుకలను నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. స్వామికి నారికేళ జలంతో స్నానం, ప్రత్యేక పూజలు చేయనున్నామన్నారు. ఈ వేడుకల కారణంగా అస్వస్థతకు గురై స్వామి వారు సుమారు పక్షం రోజులు గదికే పరిమితమై ద్వితీయ పక్షాన రథయాత్రతో భక్తులకు దర్శనమిస్తామన్నారు.

సీపీఎస్ రద్దు కోరుతూ ఉద్యమం

టెక్కలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సీపీఎస్ రద్దు కోరుతూ ఉద్యమం ఉధృతం చేస్తున్నామని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు శరత్‌బాబు అన్నారు. మంగళవారం పలు ప్రభుత్వ కార్యాలయాల్లో చైతన్య యాత్రపై అవగాహన కల్పించారు. సీపీఎస్ ఉద్యోగులపై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. పాతపెన్షన్ పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజేశ్వర రావు, బోకర బాలకృష్ణ పాల్గొన్నారు.

గ్రామదేవత ఉత్సవాల సందడి

● అంబరాన సిరిమాను సంబరం
● వేషధారణలతో ఆకట్టుకున్న కళాకారులు
● బంధువులతో గ్రామాలు కిటకిట

పలాస, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం పలు గ్రామాల్లో గ్రామ దేవత ఉత్సవాల నేపథ్యంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. అమ్మవార్లకు ముర్రాటలు సమర్పించడం, సిరిమాను సంబరాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా పలాస పొందరవీధిలో వెలసిన పెంటపోలమ్మ అమ్మవారి జాతర మంగళవారంతో ఘనంగా ముగిసింది. జంటపట్టణాలకు చెందిన మహిళలు భారీగా ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. ఐదు రోజులపాటు నిర్వహించిన ఈ జాతరలో అనేక సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. చివరిరోజు అమ్మవార్ల వేషధారణలు ప్రత్యే క ఆకర్షణగా నిలిచాయి. స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి భక్తులు ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ముగిసిన జడ్డమ్మతల్లి గ్రామదేవత పండగలు

పాతపట్నం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బూరగాం గ్రామంలో ఈనెల 2వ తేదీ నుంచి ప్రారంభమైన జడ్డమ్మతల్లి గ్రామదేవత ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. సాయంత్రం సిరిమానోత్సవాన్ని నిర్వహించారు. ప్రహరాజు పొల్లాయితో పాటు శ్రీరామ్ పంతులు తదితర గ్రామ పెద్దల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం సందడిగా జరిగింది. గ్రామంలోని అన్ని వీధులు, ప్రధాన రహదారి గుండా సిరి మాను తిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. భక్తులు ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించారు.


మెళియాపుట్టిలో ఘటాలతో ఊరేగింపు


పలాస: అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న మహిళలు

ఘనంగా గ్రామదేవత ఉత్సవాలు

మెళియాపుట్టి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి, పెద్దపద్మాపురం గ్రామాల్లో మంగళవారం గ్రామదేవత ఉత్సవాలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. మూడు రోజుల నుంచి జరుగుతున్నా ఉత్సవాలు ముగిశాయి. ప్రతి ఇంటి నుంచి ఘటాలను మహిళలు తీసుకువచ్చి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఊరేగింపులో పగటి వేషాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పెద్ద పద్మాపురంలో అమ్మవారిని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దర్శించు కుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛ నీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ రమేష్‌బాబు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


నందిగాం: పీవీ పురంలో సిరిమాను ఊరేగింపు దృశ్యం

వైభవంగా సిరిమానోత్సవం

నందిగాం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రతాపవిశ్వనాథపురంలో పాలపోలమ్మతల్లి గ్రామదేవత సిరిమానోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఆదివారం ప్రారంభమైన ఉత్సవాలు ముగిశాయి. సిరిమానుపై పూజారి కంచరాన ధర్మారావునాయుడు ఆశీనులై కదలడంతో ప్రతి ఇంటా సిరిమానుకు ముర్రాటలు సమర్పించి భక్తిభావాన్ని చాటుకున్నారు. చుట్టాలు, బంధువులు తరలిరావడంతో గ్రామం జనాలతో కిక్కిరిసింది. గ్రామంలో మంగళవారమే విందు ఏర్పాటు చేయడంతో సందడి నెలకొంది. మదనాపురంలో చింతలపోలమ్మ గ్రామదేవత ఘటాల ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో మహిళలు మేళతాళాలు, పగటి వేషాల మధ్య ఊరేగించి అమ్మవారికి ముర్రాటలు సమర్పిం చారు.

కనులపండువగా శివపార్వతుల కల్యాణం


పాతపట్నం: శివపార్వతుల కల్యాణం దృశ్యం

ఘనంగా మైనాకోత్సవం

జలుమూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో మంగళవారం రాత్రి మైనాకోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి పాంచరాత్ర కల్యాణ మహోత్సవాల్లో భాగంగా అర్చకులు మైనాకోత్సవం నిర్వహించి పార్వతీ పరమేశ్వరుల కల్యాణంలో మైనాకుడు చేసిన పనిని గుర్తు చేశారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో బలిహరణ చేపట్టి అష్టదిక్పాలకు పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించి గ్రామం పొలిమేరలకు చేర్చి ప్రత్యేక పూజలు చేశారు. ఉన్నతపాఠశాల సమీపంలో అర్చకులు గడ్డితో పరమేశ్వరుని ఇంటిని తయారుచేసి దానిని దగ్ధం చేసి మైనాకోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు, దేవాలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


మైనాకోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పాతపట్నం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): తెంబూరులో చంద్ర శేఖరస్వామి ఆలయంలో మంగళవారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటీ జేష్టమాసం పౌర్ణమి రోజున కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ అని గ్రామ పురోహితులు, ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్ర మంలో గ్రామపెద్దలు, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.